క్లుప్తంగా

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి

గోస్పాడు: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని చూస్తున్నా జీపీఎస్, యూపీఎస్ విధానాలను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నరసింహారెడ్డి, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో మెలగాలి

దొర్నిపాడు: పగలు, కక్షలకు దూరంగా ఉండి ఐకమత్యంతో మెలగాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. ఆదివారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసికట్టుగా ఉండి గ్రామాభివృద్ధి చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలన్నారు. అలాగే యువకులు బెట్టింగులు, ప్రైవేటు రుణయాప్‌ల జోలికి వెళ్లరాదన్నారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పిల్లల కదలికలను గమనిస్తుండాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రుద్రవరం: శ్రీరంగాపురం పరిధిలోని తెలుగు గంగ పంట కాల్వల వద్ద నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం ఆమె ఆయా శాఖల అధికారులతో ఆ గ్రామానికి వెళ్లారు. ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి తమ గ్రామానికి ఒక తూము ఏర్పాటు చేయాలని, అలాగే సంపూర్తిగా ఉన్న పంట కాల్వలు పూర్తి చేయించాలని, గ్రామ సమీపంలోని ఎస్ఎస్ ట్యాంకు కట్ట తెగిపోయిందని ఆ కట్టకు మరమ్మతులు చేయించి ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

విద్యుత్ అనుమతి తప్పనిసరి

ఉయ్యాలవాడ : గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా విద్యుత్‌శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ గురప్ప పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిమలు వద్ద అనధికారికంగా విద్యుత్ దీపాలు వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ వినియోగం కోసం స్థానిక లైన్‌మెన్ల ద్వారా లేదా విద్యుత్ ట్రాన్స్‌కో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళ నేత్రాలు దానం



కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ మాధవీలత

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని దేవనగర్ ప్రాంతానికి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందగా ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి మాధవీలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలన్నారు. మరణించిన తర్వాత కళ్లు మట్టిలో కలిసిపోకుండా దానం చేస్తే ఇతరులకు కంటి చూపును ప్రసాదించిన వారవుతారన్నారు. ఆదిలక్ష్మి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు నాగేశ్వరరావు, నరేంద్రలను ఈసందర్భంగా ఆమె అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, సభ్యులు నాగేశ్వరరావు, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతిసారంపై అవగాహన

శిరివెళ్ల: స్థానిక మోడల్ స్కూల్ హాస్టల్‌లో సోమవారం వైద్య సిబ్బంది అతిసారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ భవ్య మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. వానాకాలంలో కాచిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందచేశారు.



ఆళ్లగడ్డ.. నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



దొర్నిపాడు.. వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



శిరివెళ్ల.. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్యకర్తలు



ఉయ్యాలవాడ..మాయలూరులో మహానేత విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



నంద్యాల.. వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

నిను మరువం రాజన్నా

- మహానేత సేవలను స్మరించుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు
- వర్ధంతిని పురస్కరించుకుని ఊరూరా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళి
- ఆళ్లగడ్డ పట్టణంలో భారీ ర్యాలీ, వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకం

నంద్యాల (వ్యవసాయం/న్యూటౌన్/అర్బన్): కుల, మతాలు, పార్టీలకు అతీతంగా మానవత్వమే తన అభిమతంగా సకల జనుల సంక్షేమానికి కృషి చేసిన మహానేత వైఎస్సార్ అని వక్తలు కొనియాడారు. సోమవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఊరూరా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో పలువురు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టి మహానేతపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో నిజమైన వెలుగులు నింపిన వైఎస్సార్ సువర్ణ పాలనను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

➤నంద్యాలలో వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో.. మహానేత వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ లీగల్‌సెల్ కార్యదర్శి పెద్దీశను, జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ లీగల్‌సెల్ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, మన్సూర్, తిమ్మారెడ్డి, ముక్కెర కృష్ణారెడ్డి, వి.కృష్ణారెడ్డి, నాయక్, సుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➤వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నంద్యాల పార్లమెంటరీ అధ్యక్షుడు సన్నల సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

➤పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఊకొట్టు వాసు, బాలకృష్ణ, శివరామిరెడ్డి, ప్రసాద్, మద్దిలేటి, అహమ్మద్ రహిమాన్ తదితరులు వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు.

➤ నంద్యాల పట్టణంలోని సమతా విద్యానికేతన్‌లో సోమవారం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బాలచంద్రుడు, రమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

➤నంద్యాల మండలంలోని కానాల, అయ్యలూరు, పెద్దకొట్టాల, కొత్తపల్లె, పోలూరు, పాండురంగాపురం తదితర గ్రామాల్లో దివంగత వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు.

➤కానాల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు జగదీశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ బావమ్మ, నాయకులు మేఘనాథరెడ్డి, పాండురంగాపురం గ్రామంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పురుషోత్తమరెడ్డి, మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి, దోలావతమ్మ, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి ఘన నివాళి

ఆళ్లగడ్డ: నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్‌ను మనసారా స్మరించుకున్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి. వైఎస్సార్ సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంక్షేమ ప్రదాత వైఎస్సార్ అని ఈ సందర్భంగా పార్టీ నాయకులు కొనియాడారు.

➤దొర్నిపాడు: మండలంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు, యాదవ హక్కుల పోరాటసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల క్రిష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ చిరస్మరణీయులన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల సర్పంచి దేవమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకనూరు మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎర్రం నర్సిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

➤శిరివెళ్ల: మండలంలో శిరివెళ్ల, గోవిందపల్లె, కోటపాడు, వెంకటాపురం, వీరారెడ్డిపల్లె, బోయల కుంట్ల, మహదేవపురం, జీనేపల్లె, చెన్నూరు, గంగవరం, కామినేనిపల్లె, గుంప్రమాన్‌దిన్నె, వనికినిదిన్నెలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రాజన్న చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, కోశాధికారి వంకదార సుబ్బసత్యనారాయణ శ్రేష్ఠి, సర్పంచులు, ఎంపీటీసీలు , గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

➤ఉయ్యాలవాడ: మండలం హరివరం, మాయలూరు గ్రామాల్లో వైఎస్ఆర్ విగ్రహాలకు పాలాభిషకం చేశారు. గ్రామ సర్పంచ్ నడిపెన్న, నాయకులు సూదుల దస్తగిరిరెడ్డి, గొల్ల సురేష్, సుదర్శన్‌రెడ్డి, హోటల్ రామసుబ్బారెడ్డి ఆయా కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు.

➤ చాగలమర్రి: ఏపీ స్టేట్ వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్.బాబులాల్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధంజలి ఘటించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఎంపీటీసీ ఫయాజ్, డైరెక్టర్ ముల్లా జాబీర్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, వ్యాపార వేత్త చక్రం ముల్లా షబ్బీర్ ఆహమ్మద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

➤ ముత్యాలపాడు గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, ఎంపీటీసీ వెంకట రాముడు, ఉప సర్పంచ్ ఓబులేసు, నాయకులు రహిమాన్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో శిల్పా స్వగృహంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మునిసిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, నాయకులు



నంద్యాల మండలం కానాలలో..



చాగలమర్రి మండలం ముత్యాలపాడులో ..

చిరస్మరణీయుడు వైఎస్సార్

బొమ్మలసత్రం: సంక్షేమ పాలనతో అన్ని వర్గాల ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయులని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా అన్నారు. సోమవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా వారు స్థానిక మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి స్వగృహంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి పట్టణంలోని శ్రీనివాససెంటర్, శ్యామకాల్వ, సాయిబాబానగర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు భారీ పూలదండలు వేశారు. ఎమ్మెల్సీ, మునిసిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన మహనీయుడు వైఎస్సార్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పామ్‌షావలి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు సునీత అమృతరాజ్, చంద్రశేఖర్, సుబ్బరాయుడు, డాక్టర్ శశికళారెడ్డి, సీనియర్ నాయకులు దాల్ మిల్ అమీర్, సాయిరాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అనిల్ అమృతరాజ్ , కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నంద్యాల.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..



చాగలమర్రి.. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న షేక్.బాబులాల్

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించండి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): జిల్లా కేంద్రంలో పీజీఆర్ఎస్ వ్యవస్థను పటిష్టం చేశామని, ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్–(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. వినతుల పరిష్కారంలో జాప్యానికి తావు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరించిన కలెక్టర్ రాజకుమారి

పంట నష్టంపై నివేదికలు ఇవ్వండి

నంద్యాల(అర్బన్): జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వానలకు జరిగిన పంట నష్టంపై నివేదికలు ఇవ్వాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ రాజకుమారి, సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. జిల్లాలో భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, రోడ్లు, శిథిలావస్థలో ఉన్న మట్టి మిద్దెలు, పారిశుద్ధ్య పనులపై మంత్రి ఆరా తీశారు. వర్షాలు కొనసాగుతుండడంతో నష్ట తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం

నంద్యాల(అర్బన్): వరద బాధితుల సహాయార్థం జంబులయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వర్ధం శెట్టి విద్యావతి ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి అందజేశారు.

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకం



అభిప్రాయాలు సేకరిస్తున్న ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ చట్ట సవరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని నంద్యాల అసెంబ్లీ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ గన్ని అబ్దుల్‌కరీం అన్నారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బదర్ మసీదు ఆవరణలో ఎన్‌డీఏ సర్కారు తీసుకొచ్చిన వక్ఫ్‌సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పోస్టు కార్డు ఉద్యమానికి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు అన్యాయం జరుగుతుందన్నారు. కో కన్వీనర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతు తెలిపి బయటకు వచ్చి తాము వ్యతిరేకమని ముస్లింలకు మభ్య పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆ పార్టీ నాయకులు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో కౌన్సిల్ తమీమ్, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, డాక్టర్ బాబన్, ఇద్రూష్, జుబేర్, సుహేల్ రాణా, సర్దార్, నూర్‌బాషా, మహమ్మద్ హుసేన్‌లు పాల్గొన్నారు.

తగ్గని వరద ఉధృతి

- జలదిగ్బంధంలో పలు గ్రామాలు
- నీటమునిగిన పంట పొలాలు
- ఆందోళనలో రైతన్నలు

ఉయ్యాలవాడ: కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి సోమవారం కూడా భారీ స్థాయిలో వరదనీరు రావడంతో మండలంలోని బోడెమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, కాకరవాడ, ఒంటెద్దుపల్లె గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. ఆయా గ్రామాల ప్రజలు గత రెండు రోజుల నుంచి బయటకు రాలేని పరిస్థితి. కొందరు రైతులు పశువులకు పశుగ్రాసం తెచ్చుకునేందుకు వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు మాత్రం నదీతీర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉచిత సలహాలు ఇవ్వడం తప్ప ఎలాంటి సహాయక చర్యలు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే నది తీరం వెంట సాగు చేసిన వరి, పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు నీటమునిగాయి. మూడురోజులుగా వరద ఉధృతి తగ్గకపోవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెంటాడుతున్న కష్టాలు

దొర్నిపాడు: ఒక భారీ వర్షాలు..మరో వైపు కుందూనది ఉగ్రరూపం చూపడంతో రైతులకు కష్టాలు వెంటాడుతున్నాయి. కుందూతీరం వెంట సాగుచేసిన వరి పంట గత మూడురోజులుగా నీటిలోనే చిక్కుకుపోయింది. ఇప్పటికే రైతులు ఎకరానికి రూ.10వేల వరకు పెట్టుబడులు వెచ్చించారు. అలాగే క్రిష్టిపాడు గ్రామస్తుల పొలాలు సుమారు 300 హెక్టార్ల వరకు కుందూనది ఒడ్డున ఉంది. ఈ నదికి భారీ వరద నీరు రావడంతో బ్రిడ్జిపై రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. దీంతో రైతులు కోవెలకుంట్ల, గుళ్లదూర్తి ప్రాంతాల మీదుగా వెళ్లి పంటలను చూసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. విలువైన మోటార్లు, పైపులు వరదనీటిలో కొట్టుకోపోకుండా కొందరు రైతులు వాటిని తాళ్లతో చెట్లకు కట్టారు.



బోడెమ్మనూరు గ్రామాన్ని చుట్టుముట్టిన కుందూనది వరద నీరు



ఆర్.జంబులదిన్నె గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



పెద్దయమ్మనూరు గ్రామ సమీపంలో నీట మునగిన పత్తి పంట



పొలాల్లోని పైపులు వరద నీటిలో కొట్టుకు పోకుండా చెట్లకు కట్టిన దృశ్యం

వక్కిలేరు వాగుకు కొనసాగుతున్న వరద

రుద్రవరం: మండలంలోని వక్కిలేరు వాగులో వరద ఉధృతి కొనసాగుతోంది. చిలుకలూరు–బత్తలూరు వైపు మాత్రం రాక పోకలు నిలిచి పోయాయి. అక్కడలో లెవెల్ వంతెన కావడంతో నీరు ఆ వంతెనపై పారుతోంది.ఆ వాగులో ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా పోలీసులు రాక పోకలను నిలిపేశారు. అలాగే వాగుకు ఇరువైపులా ముళ్ల కంప అడ్డుకట్టగా వేసి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రైం కార్నర్

రాగి తీగల దొంగ అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారు ప్రాంతాల్లో రాగి తీగల చోరీలకు పాల్పడిన దొంగను తాలూకా పోలీసులు పట్టుకున్నారు. విద్యుత్ మోటార్లలోని రాగితీగల చోరీపై రైతుల ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌నగర్‌కు చెందిన గోవిందుపై వారు నిఘా ఉంచారు. సోమవారం అతను ఆటో నగర్ వద్ద రాగి తీగలు విక్రయించేందుకు చూస్తుండగా అనుమానంతో పట్టుకుని విచారించారు. నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఇస్రార్‌బాషా తెలిపారు. నిందితుడి నుంచి రూ. 50 వేలు విలువ చేసే రాగి తీగలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

స్పోర్ట్స్

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): జిల్లాకు చెందని క్రీడాకారులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ఆ క్రీడ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి సోమవారం ఓ ప్రకటనలో. గత నెల 31, సెప్టెంబర్ 1వ తేదీన తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి బాలికల విభాగంలో మేఘనరెడ్డి, బాలుర విభాగంలో ఫర్హుల్లాలు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు.

ఈ రోజు

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి పీఎస్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

మార్కెట్ యార్డులో వినాయక పూజ సామగ్రి విక్రయాలు

నంద్యాల(సిటీ): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని దేవుని పూజ సామగ్రి, చిన్న మట్టి గణపతి విగ్రహాల విక్రయాలు నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రోడ్లకు ఇరువైపులా పూజ సామగ్రి విక్రయించరాదన్నారు. దీని వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు.

రామకృష్ణ ఆశయాలు సాధిస్తాం

నంద్యాల(న్యూటౌన్): రైతు ఉద్యమ నేత రామకృష్ణ ఆశయాల సాధనకు పాటుపడతామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీపీఎం కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో రామకృష్ణకు నివాళులర్పించారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హర్షవర్ధన్, కార్యదర్శిగా చిన్న హుసేన్, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్, విక్రమ్, కిశోర్, సహాయ కార్యదర్శులుగా ధను, హుసేన్‌లను ఎన్నుకున్నట్లు జిల్లా కన్వీనర్ ఎంఆర్ నాయక్ తెలిపారు.

ఇసుక అందుబాటులోకి తేవాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల కోసం ఇసుకను అందుబాటులోకి తేవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం చాంద్‌బాడలో మాలీ అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడారు.

ప్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చేయూత

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసినట్లు నందిగ్రూప్ ఆఫ్ సంస్థ అధినేత సుజల సోమవారంప్రకటనలో తెలిపారు. తమ తండ్రి దివంగత ఎస్పీవై రెడ్డి చూపిన మార్గంలో నడుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రేషన్‌షాపు డీలర్ల పోస్టుల భర్తీ

శిరివెళ్ల: మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ షాపు డీలర్ల పోస్టులను భర్తీ చేసినట్లు తహసీల్దార్ పుష్పవతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 11 పోస్టులు ఖాళీగా ఉండగా అందులో శిరివెళ్లలో ఒకటి, యర్రగుంట్లలో రెండు పోస్టులను భర్తీ చేశామన్నారు. డీలర్లు రాజీనామా చేయడం, మరణించడం ద్వారా అక్కడ ఖాళీలు పడ్డాయన్నారు.

గిరిజన కాలనీ సమస్యలు పరిష్కరించండి

నంద్యాల(న్యూటౌన్): అబ్బీపురం గిరిజన కాలనీని ఐటీడీఏలో చేర్చి మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. అనంతరం సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన కాలనీలో మంచినీరు, వీధి దీపాలు, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మహిళకు న్యాయం చేయాలి...

కానాల గ్రామానికి చెందిన లతను వేధిస్తున్న కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి, బాధితురాలికి న్యాయం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు లక్ష్మీదేవి, రజిత డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

సామూహిక వివాహాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): సామూహిక వివాహాల పేద ముస్లింల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అంజుమన్ అధ్యక్షుడు అబ్దుల్‌కుద్దూస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన అంజుమన్ షాదీఖానాలో ఉచిత సామూహిక వివాహాలు జరుగుతాయన్నారు. పేద ముస్లిం అమ్మాయిలు 19వ తేదీ నాటికి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంజుమన్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివాహం రోజున వధువుకు రూ.50 వేలు నగదు చెక్కు అందజేయడంతో పాటు నిఖా ఫీజును అంజుమనే భరిస్తుందన్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పని సరి

నంద్యాల(అర్బన్): గ్రామాల్లో గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. గణేష్ మహోత్సవ ఏర్పాట్లపై సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊరేగింపు ప్రదేశాల్లో తాగునీటి వసతితో పాటు ముమ్మర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ గంగయ్యయాదవ్, ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు, డీటీ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీ కృష్ణ నాయక్ పాల్గొన్నారు.